
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.269 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 52.269 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువన వివిధ కాలువలకు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.98,150
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,862
3 శాతం జీఎస్టీతో	రూ.9,128
సవర (8 గ్రా)	రూ.73,024

గరిష్టం/కనిష్టం
36.3 /23.4

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. బుధవారం గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి. శ్రీనివాస్ బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పరీక్షలకు 614 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 614 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 8,665 మందికి 8,051 మంది హాజరయ్యారని తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ డ్వామా, డీఆర్‌డీఏ, పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖ, విద్య, వైద్య, ఆరోగ్యం, ఐసీడీఎస్ తదితర శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. సమావేశాలకు ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు, తప్పక హాజరు కావాలని కోరారు.

డీసీపల్లిలో 504 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 504 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 621 బేళ్ల వాటిలో 504 బేళ్లను విక్రయించినట్లు తెలిపారు. వేలంలో 64276.6 కిలోల పొగాకును విక్రయించగా రూ.16994514.90 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.225 లభించగా, సగటు ధర రూ.264.40 లభించింది. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలి

- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్


నెల్లూరురూరల్: వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 'వ్యవసాయంలో కిసాన్ డ్రోన్ల వినియోగం – ఉపయోగాలపై జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పురుగు మందుల పిచికారీ, ఎరువుల చల్లకం వంటి పనులకు తక్కువ ఖర్చుతో డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవచ్చన్నారు. రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అనేక నూతన శాస్త్ర సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఒక్కొక్క డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు కాగా 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో బ్యాంకు రుణ సదుపాయంతో అందిస్తున్నట్లు వివరించారు. ఎంపిక చేసిన కంపెనీల ప్రతినిధులు డ్రోన్లను రైతులకు అందించి, డ్రోన్ వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారన్నారు. రైతులు ఐదుగురు చొప్పున గ్రూపుగా ఏర్పడి ఈ డ్రోన్‌ను పొందవచ్చున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులతో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 41 రైతు సంఘాలకు ఈ డ్రోన్లు అందించేందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. తొలుత డ్రోన్ కంపెనీల ప్రతినిధులు ప్రత్యక్షంగా డ్రోన్లను చూపించి వాటి పనితీరు, బ్యాటరీల చార్జింగ్, సాంకేతిక పరిజ్ఞానం మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, వ్యవసాయశాఖ ఏడీలు శేషగిరి, నర్సోజీరావు, టెక్నికల్ ఏఓ మంజుల, డ్రోన్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బడికి నారా చెదలు

రెండో విడత నాడు–నేడు పనులకు గ్రహణం

- 1,356 స్కూళ్లు, అంగన్‌వాడీలు డైట్, బీఈడీ కళాశాల అభివృద్ధికి ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.466.94 నిధుల మంజూరు
- సెంట్రల్ ప్రొక్యూర్డ్ కింద మరో రూ.114.96 కోట్ల ఖర్చు
- పేరెంట్స్ కమిటీ అకౌంట్లలో రూ.2.31 కోట్ల నిల్వ
- అయినాఎక్కడి పనులు అక్కడే
- గత నెల 31న రూ.7.58 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఈ డబ్బులు ఎక్కడా ఖర్చు చేయొద్దని ఆదేశాలు

జిల్లాలో రెండో విడత నాడు–నేడు పనులకు చంద్రగ్రహణం పట్టింది. సగంలో ఆగిపోయిన ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీలు, డైట్, బీఈడీ కళాశాల అభివృద్ధి పనులు తిరిగి పునః ప్రారంభం కాలేదు. ఆయా పనులకు సంబంధించి గత ప్రభుత్వంలోనే నిధులు కేటాయించి మంజూరు చేసినా.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా ఎక్కడి పనులు అక్కడే ఆపేసింది. గత విద్యా సంవత్సరం నాటికే ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. సీఎం తనయుడే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఆ వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలివేసి నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



భక్తవత్సలనగర్‌లోని మోడల్ ప్రీస్కూల్లో సగంలో ఆగిపోయిన నిర్మాణ పనులు

నెల్లూరు (టౌన్): చంద్రబాబు సీఎం, ఆయన కుమారుడు లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ బడులకు చెదలు పట్టిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు రెండో విడత కింద అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినా.. ఆ పనులు ఎక్కడిక్కడ నిలిపివేశారు. పైగా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నట్లు హడావుడిగా గత నెల 31న రూ.7.58 కోట్ల మంజూరు చేసినా.. ఈ నిధులు ఎక్కడా ఖర్చు చేయొద్దని ఆదేశాలు జారీ చేశారంటే ప్రభుత్వ బడుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంది.

నాడు–నేడుతో పాఠశాలలకు కార్పొరేట్ కళ

జిల్లాలో తొలి విడతగా నాడు–నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులతో ఆయా పాఠశాలలు కార్పొరేట్ కళను సంతరించుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయా పాఠశాలల్లో నూతన టాయిలెట్లు, రన్నింగ్ వాటర్, ఆర్వో ప్లాంట్లు, ఇంగ్లిష్ ల్యాబ్, గ్రీన్‌చాక్‌బోర్డు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్, మేజర్ అండ్ మైనర్ రిపేర్లు, పెయింటింగ్, ప్రహరీలు, కిచెన్ షెడ్, ఫ్యాన్లు, లైట్లు, అదనపు తరగతి గదులు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికను రూపొందించారు. తొలి విడతలో 1,059 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.231.60 కోట్లతో ఈ సౌకర్యాలను కల్పించారు. రెండో విడతలో 1,356 పాఠశాలలు, అంగన్‌వాడీలు, డైట్, బీఈడీ కళాశాలను ఎంపిక చేశారు. వీటిల్లో వసతులు కల్పించేందుకు రూ.466.94 కోట్ల నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా రూ.190.45 కోట్ల నిధులను కూడా విడుదల చేశారు. ఈ నిధులతోపాటు రూ.16.48 కోట్లకు సిమెంట్, రూ.95.84 లక్షలకు ఇసుక, సెంట్రల్ ప్రొక్యూర్డ్ మెటీరియల్ కింద మరో రూ. 97.48 కోట్లు ఖర్చు చేశారు. ఈ లెక్కన రెండో విడత నాడు–నేడు కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మొత్తం రూ.305.42 కోట్ల ఖర్చు చేశారు. ఆయా పాఠశాలల్లో 70 శాతం మేర పనులను పూర్తయ్యాయి. గత ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో నేటికి ఆయా పాఠశాలల పేరెంట్స్ అకౌంట్లలో రూ.2.31 కోట్ల నిధులు నిల్వ ఉన్నట్లు సమగ్రశిక్ష అధికారులు చెబుతున్నారు.

నాడు–నేడు పనులు పరిశీలిస్తే..



నెల్లూరు మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎంసీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పనులు చకచకా సాగాయి. 115 అంగన్‌వాడీల్లో 89 కేంద్రాలను అభివృద్ధి చేశారు. మరో 26 అంగన్‌వాడీల్లో పనులు పూర్తికాలేదు. 919 పాఠశాలల్లో రన్నింగ్ వాటర్‌తో 342 టాయిలెట్స్ నిర్మాణాలను పూర్తి చేశారు. 554 టాయిలెట్స్‌కు కేవలం తలుపులు బిగించాల్సి ఉంది. మరో 20 టాయిలెట్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 412 కిచెన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో 158 నిర్మాణాలను పూర్తి చేయగా, మరో 229 షెడ్లకు తలుపులు బిగించాల్సి ఉంది. ఇంకా 24 కిచెన్ షెడ్ల పనులు జరుగుతున్నాయి. జిల్లాలో 882 అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టగా వాటిల్లో 385 అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేశారు. మరో 485 గదులకు తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇంకా 12 తరగతి గదులు నిర్మాణంలో ఉన్నాయి. 696 టాయిలెట్స్‌కు మరమ్మతులు చేపట్టగా 371 చోట్ల పూర్తి చేశారు. మరో 319 టాయిలెట్స్‌కు కేవలం తలుపులు రిపేర్లు చేయాల్సి ఉంది. 6 టాయిలెట్లు మరమ్మతు దశలోనే ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 579 ఇంగ్లిష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 353 ల్యాబ్‌లను పూర్తి చేశారు.

ఎక్కడ పనులు అక్కడే నిలిచిన వైనం



నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని మోడల్ ప్రీస్కూల్లో సగంలో ఆగిపోయిన పనులు

జిల్లాలో రెండో విడత నాడు–నేడు పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా.. నాడు–నేడు పనులను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం చివరి దశలో ఉన్న పనులైనా పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా నాడు–నేడుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కంటే ప్రైవేట్ విద్యా రంగానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎంసీ హైస్కూల్లో చివరి దశలో ఉన్న అదనపు గది పనులు

10 నుంచి 15 శాతం లోపు ఉన్న పనులు పూర్తి చేస్తాం

జిల్లాలో రెండో విడత నాడు–నేడు పనులకు సంబంధించి 10 నుంచి 15 శాతం లోపు ఉన్న పనులు ఉన్న పాఠశాలల వివరాలను పంపించాలని ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చాం. వారు పంపించిన వెంటనే ఆ పనులను పూర్తి చేసేందుకు కలెక్టర్‌కు నివేదిక అందించి, అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికల్లా పూర్తి చేయాలని నిర్ణయించాం.

– వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష

అటకెక్కిన కాలువల అభివృద్ధి

జిల్లాలో రెండు ప్రధాన జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండబట్టి సరిపోయింది. లేదంటే జిల్లాలో సాగు మాట మరిచిపోవాల్సిన పరిస్థితులు ఉండేవి. మొదటి పంట సమయంలో పంట కాలువల అభివృద్ధిపై ఇచ్చిన హామీలను ఇంత వరకు నెరవేర్చలేదు. రబీ సీజన్‌కు సంబంధించి జరిగిన ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని సోమశిల హైలెవల్ కెనాల్ ప్రాజెక్ట్ పనులు పూర్తిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఇలా ఎన్నెన్నో హామీలిచ్చారు. కానీ నేటికి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. పంట కాలువల అభివృద్ధి చేయకపోతే.. సాగునీరు పారేదెలా అని రైతుల ప్రశ్నిస్తున్నారు.

- మొదటి పంట సమయంలో ఇచ్చిన హామీలకు దిక్కులేదు
- కాలువల మరమ్మతులు లేవు
- ఓఅండ్ఎం పనులకు రూ.55 కోట్ల ప్రతిపాదనలు
- ప్రస్తుతం సోమశిలలో 52.653, కండలేరులో 47.530 టీఎంసీలు
- ఎక్కడికక్కడే ఫ్లడ్ బ్యాంక్ పనులు
- సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ పనులూ అదే తీరు
- నియోజకవర్గానికి రూ.2 కోట్లతో సరి



ముత్తుకూరు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, ప్లాస్టిక్ చెత్త

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గతేడాది నవంబర్‌లో రబీ పంటకు సాగు నీటి విడుదలకు నిర్వహించిన ఐఏబీ సమావేశంలో మంత్రి నారాయణ అనేక హామీలిచ్చారు. ప్రధానంగా ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతలు ప్రతిపాదించిన సమస్యలపై మంత్రి మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల ద్వారా పంట కాలువల స్థితిగతులను తెలుసుకుని పూర్తిస్థాయిలో పూడిక తీయడం, జమ్ము వంటి పూడిక తొలగిస్తామని, స్వర్ణముఖికి నీటి కేటాయింపులు పెంచుతామని, కాలువల మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. తాజాగా ఖరీఫ్ (రెండో పంట)కు సాగు నీటి విడుదల చేసేందుకు గురువారం ఐఏబీ సమావేశం నిర్వహించనున్నారు. అయితే మొదటి పంట సమయంలో ఇచ్చిన హామీలనే నెరవేర్చకుండానే నీటి విడుదల చేశారు. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో చివరి ఆయకట్టు రైతులు కొంత ఇబ్బందులు పడినా.. చివరకు రైతులు గట్టెక్కారు. రబీ ఐఏబీ సమావేశంలో చెప్పినట్లుగా ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ కింద (ఓఅండ్ఎం) రూ.55 కోట్లతో పనుల ప్రతిపాదనలు చేశారు. ఈ నిధులతో కాలువల మరమ్మతులు, పూడిక తీతలు, గండ్లు పడ్డ కాలువలను బాగు చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. అయితే అందులో రూ.22 కోట్లతో పనులు చేసినట్లు బిల్లులను అప్‌లోడ్ చేశారు. కానీ ఆ బిల్లులను ప్రభుత్వం రకరకాల కారణాలతో ఇవ్వలేదు. నీటి తీరువా పన్నులు వసూలు చేయలేదు. కాలువలపై లస్కర్లు లేరు. ఇలా మొదటి పంట ఎవరికి నోరు ఉంటే వారి పొలాలకు నీరు అందజేసుకున్నారు. ఇష్టమొచ్చినట్లు మోటార్లు బిగించుకుని నీటిని తోడుకున్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందిన పరిస్థితే లేదు.

ప్రధాన కాలువల అభివృద్ధి ఊసేలేదు..

డెల్టాలో ప్రధాన కాలువలైన జాఫర్‌సాహెబ్‌కాలువ, వల్లూరు కాలువ, కృష్ణపట్నం కాలువ, సర్వేపల్లి కాలువలు మొదటి పంట నుంచి ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలువల్లో నీరు ప్రవహిస్తుండడంతో ఎటువంటి మరమ్మతు పనులు జరగలేదు. సోమశిల జలాశయం ఆప్రాన్ పనులను వెంటనే చేయిస్తామంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగస్టులో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు హామీ ఇచ్చాడు. ఇంత వరకు అక్కడ ఒక్క పని కూడా మొదలు పెట్టలేదు. పెన్నా ఫ్లడ్‌బ్యాంకులు, సర్వేపల్లి కాలువ రివిట్ పనులు ఇలా చెప్పుకుంటూ పోతే ఇరిగేషన్‌కు సంబంధించి ఒక్క కాలువలకు సైతం నయా పైసా చెల్లించలేదు. ఈ క్రమంలో రెండో పంటకు సంబంధించి ఐఏబీలో రైతుల సమస్యలను పట్టించుకుని కాలువలను మరమ్మతు చేసి నీటిని వదలాలని రైతులు కోరుకుంటున్నారు.

రూ.22 కోట్ల బిల్లులు సర్వేపల్లివేనా?

ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ కింద (ఓఅండ్ఎం) రూ.55 కోట్లతో ప్రతిపాదనలు చేసిన పనుల్లో రూ.22 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశారు. అయితే వీటిని ప్రభుత్వం మంజూరు చేయలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఆ బిల్లులను ఆమోదించకపోవడంతో అసలు ఈ పనులు జరిగాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు సైతం ఈ విషయంపై స్పందించడం లేదు. ఎక్కడికక్కడ రాజకీయ నాయకుల విపరీత జోక్యంతో పనులు జరిగాయని, అందుకే బిల్లులు పెట్టాల్సి వచ్చిందని తమ మీద తప్పు లేకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. అయితే ఈ బిల్లులు సర్వేపల్లివేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో కాలువల్లో పూడికతీత పనుల్లో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పనులు మొదలు పెట్టినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూడికతీత పనుల్లో డొల్లతనాన్ని ఆధారాలతో సహా వెల్లడిస్తూ వచ్చారు. కాలువ పనుల పరిశీలనకు కూడా వెళ్లనివ్వకుండా ఆయన్ను హౌస్ అరెస్ట్ చేసిన పరిస్థితి. దీన్ని బట్టి ఈ రూ.22 కోట్ల బిల్లులు కేవలం సర్వేపల్లి కాలువలకే పెట్టినట్లు అర్థమవుతోంది.

నియోజకవర్గానికి రూ.2 కోట్లు

జిల్లాలో కాలువల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ చేసిన ప్రతిపాదనలను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఆత్మకూరు నియోజకవర్గంలో 77 పనులు, కోవూరులో 106, నెల్లూరు రూరల్‌లో 60 పనులు, సర్వేపల్లిలో 126, కావలిలో 113, ఉదయగిరిలో 74 పనులకు రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.2 కోట్లు ఇస్తాం. మీకు అవసరమైన పనులు మీరు నిర్ణయించుకుని చేసుకోమని మౌఖిక ఆదేశాలివ్వడంతో స్థానిక నాయకుల గుండెలకు గండ్లు పడ్డాయి.

ప్రణాళికాబద్ధంగా నీటి పంపిణీ

నీటి లభ్యతను బట్టి అన్ని ప్రాంతాలకు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా నీటిని అందజేస్తున్నాం. ప్రభుత్వ సూచనల మేరకు కాలువల మరమ్మతులు అవసర ప్రాతిపదికన చేపడుతున్నాం. గురువారం ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశం మందిరంలో జరిగే ఐఏబీ సమావేశంలో ఆయా కాలువల పరిధిలో ఎన్ని ఎకరాల్లో రెండో పంటకు నీరు అందిస్తామనే స్పష్టత వస్తుంది. చెరువులు, కాలువల ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– దేశ్‌నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

రెండో పంటపై గంపెడాశలు

- మొదటి పంటకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు
- తగ్గిన దిగుబడులు, ధరల పతనంతో రైతులకు తీవ్ర నష్టం
- రెండో పంటతోనైనా నష్టం పూడ్చుకోవాలని రైతుల ఎదురుచూపులు
- నేడు ఐఏబీ సమావేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ.. రైతులు తొలి పంట (రబీ)లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గి ఒక రకంగా, ధరలు లేక మరొక రకంగా నష్టపోయారు. తాజాగా జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో రెండో పంట (ఖరీఫ్)పై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. రబీ సీజన్ సమయంలో జరిగిన ఐఏబీ సమావేశం జరిగిన రోజు నాటికి ప్రధాన జలాశయాలతోపాటు చెరువులు, మినీ రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు, వర్షాలు, వరదల ద్వారా వచ్చే నీటిని అంచనా వేసి మొదటి పంటకు 7.77 ఎకరాలకు సాగు నీరు కేటాయించారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల్లో తాగు, డెడ్ స్టోరేజీ పోను మిగిలే నీటిని లెక్క కట్టి రెండో పంటకు నీటిని విడుదల చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో ఈ మేరకు ప్రకటించనున్నారు.

సోమశిల ద్వారా రబీలో 5.51 లక్షల ఎకరాలకు..

రబీ సీజన్‌లో సోమశిల కింద అప్పటి వరకు ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్ వరద నీటిని అంచనా వేసి అందులో తాగునీరు, డెడ్ స్టోరేజీ, ఆవిరి రూపంలో పోయే నీటిని మినహాయించి కనిగిరి రిజర్వాయర్‌తో కలిపి నికరంగా 71 టీఎంసీలు లెక్క తేల్చి 5.51 లక్షల ఎకరాలకు 55.100 టీఎంసీలు కేటాయించారు. దీంతోపాటు రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు 1.5 టీఎంసీలు కేటాయించారు. అయితే ప్రస్తుతం సోమశిల జలాశయంలో 52.653 టీఎంసీలు, కనిగిరి రిజర్వాయర్‌లో 2.472 టీఎంసీలు, సర్వేపల్లి రిజర్వాయర్‌లో 1.143 టీఎంసీలతో కలిసి 56.268 టీఎంసీల నీటి లభ్యత ఉంది. తాజాగా రాళ్లపాడుకు నీటి కేటాయింపులు చేయాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న నిల్వలో తాగు, డెడ్ స్టోరేజీ, ఆవిరి నీరు పోను ఎన్ని టీఎంసీలు నికరం తేల్చి నీటి కేటాయింపులు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

కండలేరు నుంచి 2.26 లక్షల ఎకరాలకు..

ఇక కండలేరు జలాశయం ద్వారా రబీ సీజన్‌లో అప్పటి వరకు 49.386 టీఎంసీలు నిల్వ ఉండగా, మరో 10.614 టీఎంసీలు భవిష్యత్ వరదను అంచనా వేసి మొత్తం 51.600 టీఎంసీల నికర నిల్వ నీటిలో 22.600 టీఎంసీలను 2.26 లక్షల ఎకరాలకు కేటాయించారు. ప్రస్తుతం కండలేరులో 47.530 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాల తాగు నీటి అవసరాలకు 2 టీఎంసీలు, 6 టీఎంసీలు ఆవిరి నష్టం పోను మిగిలే నికర నిల్వను దృష్టిలో పెట్టుకుని గతంలో మాదిరిగానే సాగునీటి కేటాయింపుల ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

నగర పాలక కమిషనర్ సూర్యతేజ బదిలీ



సూర్యతేజ

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు ఉత్తర్వులో పేర్కొంది. సూర్యతేజ గతేడాది జూలై 24న నగర పాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కూడా కాకుండానే కేవలం 9 నెలల 22 రోజుల్లోనే ఆయన్ను బదిలీ చేయడం అధికార, రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్ అయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో నాలుగేళ్లలో ఇన్‌చార్జి కమిషనర్‌తో సహా 9 మంది ఐఏఎస్ అధికారులు ఆ పార్టీ నేతల ఆధిపత్యానికి బలయ్యారు. ఎన్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అధికారులందరూ కనీసం ఏడాది పాటు కూడా విధులు నిర్వర్తించకుండానే బదిలీ అవుతూ వచ్చారు. తాజాగా టీడీపీ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ నేతల ఆధిపత్యానికి బలైన తొలి కమిషనర్‌గా సూర్యతేజ నిలుస్తున్నారు. భవిష్యత్ కాలంలో ఎంత మంది సూర్యతేజలు అవుతారనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త కమిషనర్‌ను నియమించకపోవడం, ఇన్‌చార్జిగా జేసీకి అప్పగిస్తారా? లేక కొత్త వారిని నియమిస్తారా అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ బుధవారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పరిషత్, మండల పరిషత్, 24–25 సవరణ బడ్జెట్, 25–26 సంవత్సరం అంచనా బడ్జెట్, ఇతర శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

పొదలకూరు: వెంకటాచలం హౌసింగ్ ఏఈ శివమోహన్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఆ శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో పొదలకూరులో ఏఈగా పని చేసిన సమయంలో పక్కా ఇళ్ల మంజూరు, నిర్మాణం తదితర విషయాల్లో అవకతవకలకు పాల్పడినట్లు టీడీపీ నేతలు ఇటీవల పొదలకూరు పర్యటనకు వచ్చిన గృహనిర్మాణ శాఖ మంత్రి కే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శివమోహన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ఏఈ శివమోహన్ జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈలోపు ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఉలవపాడు మామిడికి గడ్డుకాలం


రాలిపడిపోయిన పిందెలు

కొంపముంచిన చీడపీడలు

- భారీగా తగ్గనున్న దిగుబడి
- లబోదిబోమంటున్న కౌలు రైతులు
- కాపాడుకునేందుకు కవర్లు కడుతున్న పరిస్థితి

ప్రతి సీజన్‌లో ఉలవపాడు మామిడి కోసం జనం ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ప్రధానంగా ఇక్కడి బంగినపల్లి రకాన్ని రుచి చూడాలని పరితపిస్తుంటారు. అయితే ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గనుంది. వాతావరణ పరిస్థితులు, చీడపీడల వల్ల మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. పూత నిలబడలేదు. పిందెలు రాలిపోతున్నాయి. పెద్దకాయలకు బొక్కలు పడి రాలుతున్న పరిస్థితులు ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలోని తోటల్లో నెలకొంది.


మామిడి తోటలు

ఉలవపాడు: కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలంలో ఏడు వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఇక ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలో చూస్తే 10 వేల ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయి. డిసెంబర్‌లో వచ్చిన కొద్దిపాటి పూత మాత్రం పిందెలు, కాయలుగా మారాయి. ఫిబ్రవరి, మార్చిలో వచ్చిన పూత మొత్తం పిందెలు కాకుండానే రాలిపోయింది. ఈ పూత కాయలుగా మారి దిగుబడి బాగుటుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. చీడపీడల తాకిడి ఉందని వాటిని కాపాడుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. రైతులు మందులు కూడా పిచికారీ చేశారు. కానీ ఎలాంటి మార్పులు జరగలేదు.

రైతుల విలవిల

ఈ ఏడాది తేనెమంచు, నల్లతామర పురుగుల వల్ల మామిడి రైతులు భారీగా దెబ్బతినే పరిస్థితి వచ్చింది. కొన్నిచోట్ల పిందెలు కాయలుగా మారాయి. వాటిలో కూడా కొన్ని కాయలకు పురుగు పట్టి బొక్కలు పడటం, నల్లగా మారి రాలిపోతున్నాయి. చాలామంది కౌలు రైతులు మామిడి తోటలు కొన్నారు. తర్వాత మందులు పిచికారీ కూడా చేయించారు. కానీ నేడు నెలకొన్న పరిస్థితులతో వారు దెబ్బతినే పరిస్థితి ఉంది. ఎకరాను రూ.20 వేల నుంచి రూ.70 వేల వరకు కొనుగోలు చేశారు. కానీ ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరి స్థితి కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

భారీగా తగ్గనున్న దిగుబడి

అధికారుల అంచనా ప్రకారం ఈ ఏడాది దిగుబడి భారీగా తగ్గనుంది. దాదాపు 30 శాతం కాపు మాత్రమే మిగిలింది. సాధారణంగా ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది కేవలం 2 టన్నులు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. కొన్ని తోటల్లో అయితే పూర్తిగా పూత, పిందెలు రాలిపోయాయి. దీంతో 20 వేల టన్నుల్లోపే వ్యాపారం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఫ్రూట్ కవర్లకు డిమాండ్

ప్రస్తుతం ఉన్న మామిడి కాయలను కాపాడుకోవడానికి రైతులు ఫ్రూట్ కవర్లు వినియోగిస్తున్నారు. ఈ కవర్లకు ప్రస్తుతం బాగా డిమాండ్ ఉంది. ఒక్కో దానికి సుమారు రూ.2.50 పడుతుంది. ఈ కవర్ కడితే కాయలను కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కవర్లు కడుతున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది మామిడి దిగుబడి భారీ స్థాయిలో తగ్గి నష్టాలు వస్తున్నట్లు రైతులు తెలిపారు.

కౌలు రైతుకు నష్టాలే..



“ఈ ఏడాది 8 ఎకరాల్లో మామిడి తోటల్ని మిత్రుడితో కలిసి కొన్నా. రూ.3.20 లక్షలకు తోటలు తీసుకున్నాం. ప్రస్తుతం రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పరిస్థితులు అనుకూలించక కాపు రాలేదు.

– సంకూరి మాచెర్ల, కౌలు రైతు, ఉలవపాడు

దిగుబడి తగ్గనుంది



“ఈ ఏడాది మామిడిలో దిగుబడి తగ్గనుంది. వాతావరణ పరిస్థితులు, చీడపీడల తాకిడి వల్ల ఇబ్బందికర పరిస్థితి వచ్చింది. ఉన్న కాయలు నాణ్యంగా ఉండటానికి మా సంస్థ ద్వారా రైతుల కోసం ఫ్రూట్ కవర్లు తెప్పిస్తున్నాం.

– యరజొన్న బాలచందర్, రైతు స్ఫూర్తి సంస్థ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ, ఉలవపాడు


కవర్లు కట్టారిలా..

ఒక్కసారిగా గాలివాన


గాలి కారణంగా షాపులపై పడిన ఫ్లెక్సీ


బుచ్చిరెడ్డిపాళెంలో రోడ్డుపై వర్షపునీరు

- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో బుధవారం ఉదయం ప్రాంతంలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. దట్టంగా మబ్బులు కమ్మేశాయి. కావలి, దగదర్తి, బుచ్చి రెడ్డిపాళెం, సంగం, నెల్లూరు రూరల్, కోవూరు ఇలా పలు మండలాల్లో చిరుజల్లులు, మోస్తరు వాన పడింది. కొన్నిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.

- నెల్లూరు నగరంలో ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఈదురు గాలులు వీచాయి. దీంతో పలుచోట్ల హోర్డింగ్‌లపై ఉన్న ఫ్లెక్సీలు చినిగిపోయాయి. బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, మనుమసిద్ధి నగర్, మూలాపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీఆర్సీ, గాంధీబొమ్మ, హరనాథపురం తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి.
- కలువాయి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గాలివాన బీభత్సం సృష్టించింది. తెలుగురాయపురం నుంచి కోటితీర్థం గ్రామానికి వెళ్లే దారిలో తాటిచెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. సైదాపురంలో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.


రోడ్డుపై పడిన తాటిచెట్లు

బంగారంతో ఉడాయించిన వ్యక్తి అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారం

- 108 గ్రాముల బంగారు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కరిగించేందుకు ఇచ్చిన బంగారంతో ఉడాయించిన వ్యక్తిని నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సంతపేట పోలీస్‌స్టేషన్‌లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. జెండావీధికి చెందిన షేక్ నిజాం కొరడావీధిలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద జనార్దనరెడ్డి కాలనీకి చెందిన షేక్ మన్సూర్ ఏడాదిగా పనిచేస్తూ నమ్మకంగా ఉన్నాడు. గత నెల 8వ తేదీన నిజాం 130 గ్రాముల ప్యూర్ బంగారాన్ని కరిగించుకుని రమ్మని మన్సూర్‌కు ఇచ్చాడు. ఆ బంగారంతో అతను పరారయ్యాడు. ఈమేరకు బాధిత యజమాని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు ఆధ్వర్యంలో ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేశారు. మంగళవారం మన్సూర్ రంగనాయకులపేట రైల్వేగేట్ వద్ద వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని 108 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మల్లికార్జునయ్య, అల్లాభక్షు, వెంకటేశ్వర్లు, గోపీ, శ్రీకాంత్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

క్లుప్తంగా

మెడికవర్‌లో చిన్నారికి అరుదైన ఆపరేషన్


మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (అర్బన్): ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయిన వక్కను బయటకు తీసి చిన్నారి ప్రాణాలు కాపాడిన ఘటన నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగింది. పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి, పీడియాట్రిషియన్ డాక్టర్ ఉదయకీర్తి, అనస్థీషియన్ చీఫ్ డాక్టర్ రంగనాథ్‌లు బుధవారం వివరాలు వెల్లడించారు. కావలికి చెందిన అఖిల, తిరుపతిల ఐదేళ్ల కుమార్తె సత్యకు సీటీ స్కాన్ చేయగా ఊపిరితిత్తుల్లో ఏదో వస్తువు ఉండి మూసుకుని పోయినట్టుగా గుర్తించామన్నారు. తమ డాక్టర్ల బృందం ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపీ అనే అధునాతన శస్త్రచికిత్సతో ఫోగాటి బెలూన్ వేసి ఊపిరితిత్తుల్లో ఉన్న వస్తువును బయటకు తీసి చూడగా అది తమల పాకుతోపాటు వేసుకునే వక్కగా తేలిందన్నారు. పాప కోలుకున్నట్లు చెప్పారు.

కండలేరులో 46.384 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 46.384 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,390, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్ట్ చేశారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లాకు చెందిన శివకుమారి కొంతకాలం క్రితం నెల్లూరు హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకొచ్చి వ్యభిచార కేంద్రం నిర్వహిస్తోంది. దీనిపై సమాచారం అందడంతో సాంబశివరావు తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకురాలిని, విటుడు నెల్లూరు నగరానికి చెందిన మహేష్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను హోమ్‌కు తరలించారు.

నిమ్మధరలు(కిలో)



పెద్దవి	: రూ.105
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.50

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 119
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ చికెన్	: 170

అనుమానం పెనుభూతమై..

- భార్యను వేధించిన భర్త
- పురుగు మందు తాగిన వివాహిత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నెల్లూరు(క్రైమ్): వారిద్దరూ ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకున్నారు.. అయితే అనుమానం పెనుభూతంలా మారింది. భార్యను భర్త వేధించసాగాడు. దీంతో ఆమె పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. మనుమసిద్ధి నగర్‌కు చెందిన యశోద (28), రామకోటయ్యనగర్‌కు చెందిన ప్రైవేట్ బస్ కండక్టర్ సాగర్ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వారు రామకోటయ్య నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి మధుప్రియ, తేజ్‌కుమార్‌లు సంతానం. యశోద తెలుగుగంగ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తోంది. ఆమెపై భర్త అనుమానం పెంచుకుని నిత్యం వేధించసాగాడు. ఆత్మహత్య చేసుకో అంటూ పదేపదే తనను ఇబ్బంది పెడుతున్నాడని యశోద పలుమార్లు తన తల్లి సుమతికి చెప్పి కన్నీటి పర్యంతమైంది. ఈనెల 14వ తేదీన మరోమారు దంపతుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సాగర్ ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించి అత్తమామలకు సమాచారం అందించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యశోద మృతిచెందింది. ఈ మేరకు బాధిత తల్లి సుమతి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు

- కాలువలోకి దూసుకెళ్లడంతో రియల్టర్ మృతి
- మరొకరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు మితిమీరిన వేగంతో కల్వర్టును ఢీకొట్టి సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయలైన ఘటన నెల్లూరులోని జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బీవీ నగర్‌కు చెందిన పి.భాస్కర్‌రెడ్డి (51), లక్ష్మీభవానీ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. భాస్కర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. బుధవారం ఆయన తన స్నేహితుడైన బీవీ నగర్‌కు చెందిన శ్రీనివాసులుతో కలిసి కారులో చింతారెడ్డిపాళెంలోని స్థలాన్ని చూసేందుకు వెళ్లాడు. పని పూర్తయ్యాక జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో కారు వేగంగా వెళ్తూ ఓ ధాబా సమీపంలో ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న భాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాసులు గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించి సౌత్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలతో బాధిత కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. భార్య, బంధువులు అక్కడికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో కారు


భాస్కర్‌రెడ్డి మృతదేహం

నా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయ్


ఆందోళన చేస్తున్న స్మైలీ కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నేతలు

- భర్తే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడు
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తల్లి ఆందోళన

నెల్లూరు సిటీ: 'నా కుమార్తె స్మైలీని తక్కువ కులానికి చెందిన దానివంటూ అత్తింటి వారు వేధించారు. ఆమెది ఆత్మహత్య కాదు. భర్త నాగూర్‌బాబు చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడు' అని మల్లిక అనే మహిళ ఆరోపించింది. బుధవారం స్మైలీ కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లిక, నాయకులు మాట్లాడుతూ స్మైలీని నాగూర్‌బాబు ట్రాప్ చేసి నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడని చెప్పారు. కొంత కాలం తర్వాత కులం పేరుతో భర్త, అతడి కుటుంబ సభ్యులు దూషించారన్నారు. కట్నం తీసుకురావాలని వేధించారన్నారు. స్మైలీని నాగూర్‌బాబు కొట్టి చంపాడన్నారు. తర్వాత ఏమీ తెలియనట్టు హాస్పిటల్లో చేర్పించి పోలీసులకు లొంగిపోయాడన్నారు. స్మైలీ కుటుంబానికి న్యాయం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. రూరల్ డీఎస్పీ, సీఐలు సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న


రోడ్డుపై బైఠాయించిన నేతల్ని తీసుకెళ్తున్న పోలీసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. బుధవారం నెల్లూరు నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వీఆర్సీ మైదానం నుంచి ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ చంద్రబాబు డీఎస్సీపై మొదటి సంతకం చేసి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ చేపట్టలేదన్నారు. మంత్రి నారా లోకేశ్ వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే సమయానికి టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారని, నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. రోడ్డుపై బైఠాయించిన నిరుద్యోగులు, డీవైఎఫ్‌ఐ నాయకులను పోలీసులు పక్కకు తీసుకెళ్లి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం నాయకులు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నేతలు రమణ, నరసింహ, చైతన్య, జగదీష్, ఫయాజ్, శేఖర్, మహేష్, పవన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేల్దారి దారుణ హత్య

- మద్యం మత్తులో ఘర్షణ
- నెల్లూరులో ఘటన

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో మాటామాటా పెరిగి బేల్దారి హత్యకు దారితీసింది. పోలీసుల కథనం మేరకు.. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన సుల్తాన్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి సుల్తాన్ మద్యం తాగేందుకు సమీపంలోని పెన్నానది వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ మైపాడురోడ్డుకు చెందిన నాగరాజు, జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన కలీమ్‌లు మద్యం తాగుతున్నారు. ఏం జరిగిందో స్పష్టంగా తెలియదు గానీ సుల్తాన్‌కు, వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో కోపోద్రిక్తులైన నాగరాజు, కలీమ్‌లు కర్రతో సుల్తాన్‌పై విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది. ఇదిలా ఉండగా నిందితులు హత్య అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మద్యం లేదా గంజాయి మత్తులోనో తెలియదు గానీ ఓ వ్యక్తిపై మరో వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానికంగా ఉండే భిక్షు అయ్యప్పగుడి సెంటర్‌లోని ఓ దుకాణానికి వచ్చాడు. అక్కడ వేరే వ్యక్తితో మాట్లాడుతుండగా అప్పటికే మత్తులో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తన దగ్గర ఉన్న కత్తితో దాడి చేశాడు. ఛాతిపై పొడవడంతో భిక్షు కిందపడిపోయాడు. దీంతో స్థానికులు అప్రమత్తమై నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం భిక్షును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.